## వారం వారం
## కథాప్రభ

వా డివాళ మళ్లీ కనిపించాడు.

పది పదిహేను రోజుల తర్వాత — ముస్తఫా.

వీధి గుమ్మంలో నిలబడి తల లోపలికి పెట్టి చూస్తూ వరండాలో నేను కనిపించేసరికి పళ్లన్నీ బయట పెట్టి నవ్వుతున్నాడు.

"నువ్వా? లోపలికి రా, వెధవా!" అన్నాను.

వాడు చేతిలో బరువైన కూరగాయల సంచీతో నడిచి వచ్చి, సంచీ వరండాలో ఉంచి ఆ పక్కనే కూలబడ్డాడు. నవ్వుతూనే ఉన్నాడు. జుట్టు నున్నగా దువ్వుకుని ఉన్నాడు. కొంచెం వొదులుదే అయినా శుభ్రమైన చొక్కా తొడుక్కుని ఉన్నాడు. పేవ్‌మెంట్ మీద చౌక ధరకు దొరికే సెకండ్ హ్యాండ్ ప్యాంటు కాబోలు తొడుక్కుని ఉన్నాడు.

ఇంతకుమునుపు నాకు కనిపించిన ముస్తఫా వాలకం వేరు. అప్పుడూ ఇలాగే వీధి గుమ్మంలో నిలబడి లోపలికి చూస్తూ వాడు నా దృష్టిని ఆకర్షించాడు. అప్పుడు జుట్టు దుబ్బుగా పెరిగి తలంతా మట్టికొట్టుకుని పాముల బుట్టలా ఉంది. చొక్కా పీలికలైపోయి ఛండాలంగా ఉంది. చాలాసేపటి నుంచి ఏడవటం వల్ల కాబోలు మొహం అంతా కన్నీళ్లు చారికలు కట్టి ఉన్నాయి. కళ్లు ఉబ్బి ఉన్నాయి. అప్పుడు నేను సైగ చేస్తే లోపలికి వచ్చి కూర్చుని భోరున ఏడ్చాడు.

"ఏరా? ఏం జరిగింది?" అని ఎన్నోసార్లు అడగ్గా, ఏడుపు దిగమింగి చెప్పాడు.

"నాన్న కొట్టాడు. చచ్చేట్టు కొట్టి, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మన్నాడు."

"ఎందుకు?" అని అడిగాను నేను.

"డబ్బు తేవడంలేదని."

నిజమే. వీ డీమధ్య డబ్బు సంపాదించడం లేదు. సంక్రాంతి పండుగతో వీడి ఉద్యోగం ఊడింది. సంపాదన ముగిసిపోయింది. అంతకుముందు నిరంతరం రద్దీగా ఉండే ఒక బ్రాందీ షాపులో 'చీఫ్ బాయ్'గా పనిచేసేవాడు. వీడి కింద మరో ఛోక్రా ఉండేవాడు. గొడ్డుచాకిరీ. అయితే నేమి రోజుకు నాలుగు రూపాయల చొప్పున జీతం వారాని కోసారి చేతుల్లో పడేది. నాగా పెడితే జీతం కట్. సాధారణంగా వాడి సంపాదనను ముందుముందుగానే వాడి రోగిష్టిమారి తండ్రి ఖుద్దూస్ వచ్చి నొల్లుకుపోయేవాడు. దాన్ని గురించి ముస్తఫా బాధపడేవాడు కూడా కాదు. వాడి కది ముఖ్యమే కాదు. షాపులో మందుకొట్టిన మహానుభావులు వీడి సర్వీసుకు మెచ్చి పడేసే రూపాయి, అర్ధా వీడికి ముఖ్యం. రోజుకు ఎట్టిపరిస్థితులలోనూ పది రూపాయలు కళ్లజూసేవాడు. అందులో రూపాయో, అర్ధో మాత్రం ఉంచుకుని, మిగతాది అతి జాగ్రత్తగా తల్లి మెహతాబ్ చేతి కిచ్చేవాడు. ఆ పేద తల్లి దాంతో మిగిలిన ఇద్దరు పసిపిల్లలకు ఇంత తిండి పెట్టేది.

ఎవరో చెప్పినట్టు — అన్నట్టు ఇంత ఘనమైన విషయం చెప్పడాని కెవరో మహానుభావు లెందుకు? ఎవరైనా చెప్పవచ్చు — కాలం ఎప్పుడూ ఒకే రీతిగా గడవదు కదా !

ఉన్నట్టుండి తెలుగు కష్టజీవుల, తెలుగు బడుగుజీవుల జీవితవనంలోకి తెలుగు మంద మలయానిలంలా, తెలుగు ఆడపడుచుల కన్నీటి కడగండ్లను కరిగించే మంత్రదండంలా తెలుగు సమాజంలోని సమస్త రుగ్మతలకు దివ్యౌషధంలా, సర్వరోగ నివారిణిలా సంపూర్ణ మద్యనిషేధం మళ్లీ వచ్చింది. వస్తూ వస్తూనే ముస్తఫా నోట్లో మట్టికొట్టింది. ముస్తఫా వీధిన పడ్డాడు. అంతకాలం చాకిరీ చేసినా యజమాని ఇచ్చిం దేమీ లేదు. ఇంటికి వెళ్తే చాలు కోపిష్టి, రోగిష్టి తండ్రిచేత దెబ్బలు తప్ప తిండి తినే యోగం లేదు. అదుగో, సరిగ్గా అప్పుడు వచ్చాడు వాడు మా ఇంటికి.

అప్పుడు నేను ఒక పరిచయస్తుడితో మాట్లాడుతూ, ఇప్పటివలెనే వరండాలో కూర్చుని ఉన్నాను. వీడి సొద అంతా విని ఆ మిత్రుడు "వీణ్ణి నా కొదిలెయ్యండి. వీడి సంగతి నేను చూసుకుంటాను" అన్నాః

# ముస్తఫా

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

'అలాగే ... పాపం, ఏదో దారి చూపెట్టండి వాడికి' అని ఉంటాను నేను.

ఆ తర్వాత ఇప్పు డిలా ప్రత్యక్షమైనాడు ముస్తఫా మళ్లీ.

"ఏరా? బాగున్నావా?" అని అడిగాను నేను.

వాడు నవ్వుతూ తల ఊపాడు.

"ఏం చేస్తున్నా విప్పుడు?"

"ఆ అయ్యగారు ... మీ ఫ్రెండ్ పని ఇప్పిం చారండీ!" అన్నాడు.

"ఏం పని?"

వాడు వెంటనే బదులు పలకలేదు కాని, నెమ్మదిగా నా కుర్చీ పక్కకు జరిగి జరిగి వచ్చాడు.

"పెద్ద పనేమీ ఉండదండీ! బాగా తిరగాలి. అంతే!"

"జీతం ఎంత?"

వాడు మళ్లీ తొందరగా సమాధానం చెప్ప లేదు కాని, కాస్త ఆగి, "బాగానే ఉంటుందండీ!" అన్నాడు.

"బాగానే అంటే ...?"

"అంటే ..." అని నసుగుతూ, "ఇంత అని ఉండదండీ! కాని ట్రిప్పుకు యాభై తగ్గదండీ. ఒక్కొక్కప్పుడు రోజుకు రెండు ట్రిప్పులు కూడా పడతాయండి."



'ఏమిటో పిచ్చి గోల' అనిపించింది నాకు. మ రేమీ అడగకుండా ఊరుకున్నాను.

కాని, బహాశ ఆగలేక కాబోలు, వాడే నెమ్మది నెమ్మదిగా నాకు అంతా అర్థమయ్యే టట్టు అప్పుడప్పుడు చేతి సైగలతో నటన చేస్తూ అంతా వివరించాడు.

నేను నివ్వెరపోయాను. వీడి సంగతి చూసు కుంటా నన్న మిత్రుడు చివరకు వీడి కీ జీవనో పాధి చూపించా డన్నమాట. వింటున్నకొద్దీ నాకు భయం వేసింది కాని వాడి వాలకం, ఉత్సాహం చూసి ఏమీ మాట్లాడలేక మిన్న కుండిపోయాను.

వాడు అలా కాసేపు కూర్చుని, నేను మౌనంగా ఉండటంతో ఏమనుకున్నాడో ఏమో, లేచి "వస్తాను సార్!" అంటూ ఆ బరు వైన కూరగాయల సంచి అందుకుని భుజాన తగిలించుకుని గేటు దాటి వెళ్లిపోయాడు.

అసలు జరిగిం దేమిటంటే —

మా మిత్రుడు వీణ్ణి మంచి ఊబిలోనే దింపాడు. ఆదాయానికి ఆదాయమూ, కావల సినంత థ్రిల్లూ, సరదా — అన్నీ ఉన్నాయం దులో. వీడికి కబురొస్తుంది. అంటే ఎవరో వచ్చి, "రమ్మంటున్నారు" అని చెప్పి వెళ్లిపో తాడు. వీడు వెళ్లాలి. అక్కడ ఎవరో ఒకరు వీణ్ణి స్కూటర్ మీద ఎక్కించుకుని ఎక్కడికో తీసుకు వెళ్లి దింపుతారు. అక్కడ ఎవరో అపరిచితులు వీడికి సంచిలో సీసాలు సర్ది, పైన కూరగా యలు నింపి, బట్టలు నింపి అందజేస్తారు. ఎక్కడికెక్కడికి వెళ్లవలసిందీ సవివరంగా చెబుతారు. అన్నీ గుర్తు పెట్టుకుని ఆ అయిదా

రుచోట్లకూ తిరిగి జాగ్రత్తగా సీసాలు అందజేయాలి. వారికీ, కస్టమర్లకు మధ్య టెలిఫోన్ సంబంధా లుంటాయి. ఇచ్చిపుచ్చుకోడాలు విడిగా జరుగుతాయి. ఎక్కడా ఏ పొరపాటూ జరగదు. సీసాకు పది చొప్పున ముస్తఫాకు ముట్టజెపుతారు. అది కాక, సీసా అందుకున్న ఆసామి అమితానందంతో ఉక్కిరిబిక్కిరై పసి వెధవ మీద జాలితో తానూ వాడి కొక పది పారేస్తాడు కదా! అయితే అంతటా గట్టి కట్టడులు మాత్రం ఉన్నాయి. ఎవరైనా నిలదీసి అడిగినా వీడు నోరు జారకూడదు. జారడానికి వీలు లేదు కూడా. ఎందుకంటే వీడికి అవతలి వారి ఆనుపానులూ, వివరాలూ ఏమీ తెలియవట. కాని వాళ్ల డేగ చూపులు మాత్రం ప్రతిక్షణం వాణ్ణి వెన్నాడుతూనే ఉంటాయి. వాడి ప్రతి కదలికా వారికి తెలుస్తూనే ఉంటుంది.

నా మనసంతా అదోలాగా అయిపోయింది. మధ్యలో నే నేదో పాపం చేసినట్టు అనిపించసాగింది. నిజానికి ఆనాడు ఆ స్నేహితుడు 'వీణ్ణి నా కొదిలెయ్యండి, నేను చూసుకుంటాను' అన్నప్పుడు వాడి బాధలు తీరిపోతాయని అనుకున్నాను కాని, ఇలాంటి వ్యవహారంలో దింపుతాడని అనుకోలేదు. నాలుగు రాళ్లొచ్చే పని చూపిస్తే, పసి వెధవ, పాపం కుదుటపడతాడని అనుకున్నా నంతే.

ఇప్పు డిక లాభంలేదు. వాడితో 'మంచి చెడ్డలు' మాట్లాడి ప్రయోజనం లేదు. తేనెలో పడ్డ ఈగలా వాడు ఒక విధమైన నోట్ల మైకంలో పడిపోయిన వైనం తెలుస్తూనే ఉంది.

సాయంకాలం —

ఆరుగంటలు దాటిందేమో, ఎండ వేడిమికి కాగి మాడిపోయిన భూమి నెమ్మదిగా చల్లబడుతున్నది. అంతవరకు భీష్మించుకుని 'కదల' నని కూర్చున్న గాలి మందంగా కదలడం మొదలైంది. హాయిగా స్నానం చేసి పెరట్లో చెట్టుకింద కుర్చీలో కూర్చుని ఉన్నాను.

ఇంతలో "మీకు ఫోను" అంటూ పక్కింటి వారి అబ్బాయి వచ్చాడు. నేను వెళ్లి ఫోను అందుకుని, "హలో! ఎవరది?" అన్నాను.

"నేను మాస్టారూ, నమస్కారం!" అని పరిచితమైన కంఠం.

గుర్తుబట్టాను. పోలీసు ఆఫీసరు శంకరం — మా పాత విద్యార్థి.

"నాతో ఏమి పని పడింది నాయనా?" అన్నాను నవ్వుతూ.

"ఏమీ లేదు. చల్లని వేళ మీ పేరు విన్నాను. ఒక కప్పు కాఫీ తాగిద్దామని ..." అన్నా డతను నవ్వుతూ. "దగ్గరే కదా! రండి, ప్లీజ్!" అన్నాడు.

"సరే, వస్తున్నాను" అన్నాను.

అయిదు నిముషాలు నడక. నడుస్తున్నంత సేపూ ఒకటే ఉత్కంఠ. పాత విద్యార్థి అయినా, ఎంత వినయపరుడూ, గురుభక్తి పరాయణుడూ అయినా పోలీసు పోలీసే కదా! అందువల్ల అనవసరమైన ఆత్రుత. మెట్లెక్కుతూ ఉండగా, "రండి సార్! అయ్యగారు మీ కోసం ఎదురు చూస్తున్నారు" అన్నా డొక పోలీసు.

స్ప్రింగ్ డోర్ తెరుచుకుని లోపలికి వెళ్లగానే ముందుగా నా కళ్లకు గోడ పక్కనే ముడుచుకుని కూర్చున్న ముస్తఫా కనిపించాడు. నాకు క్షణంలో అంతా అర్థమైంది.

శంకరం — "రండి, రండి మాస్టారూ! బాగున్నారా? కూర్చోండి" అంటూ పలకరించి, "కాఫీ" అనబోతుండగా, వద్దని వారించాను.

ముస్తఫా ముఖంలోకి అప్పుడు కళ వచ్చింది. కళ్లు పెద్దవి చేసుకుని నావంకనే చూస్తున్నాడు జాలిగా.

శంకరం అటు చూపించి, "అడుగో, వేలెడంత లేడు, వెధవ! పొద్దుట్నుంచీ ప్రాణాలు కొరుక్కు తింటున్నాడు. నాలుగు గట్టిగా తగలనిద్దామనుకుంటే మనసొప్పలేదు" అంటూ కాగితాలలోకి చూస్తూ, "పేరు ముస్తఫా. తండ్రి ఖుద్దుస్ — రోగిష్టిమారివాడు. తల్లి మెహతాబ్. ఇద్దరు చెల్లెళ్లు — చిన్న పిల్లలు. ఇవాళ మా కళ్లల్లో పడ్డాడు" అని ఆగాడు.

"వీడింతకుముందు ఒక బ్రాందీ షాపులో పనిచేసేవాడు. షాపు మూతపడిపోగానే ఎవరో పట్టుకున్నారు వీణ్ణి. బాటిల్స్ హోమ్ డెలివరీ సర్వీసన్నమాట. తన కేమీ తెలియదంటున్నాడు. జేబుల్లో వెతికితే నలభై రూపాయలు కనిపించాయి. డబ్బు వ్యవహారాలు తనకు తెలియవంటాడు. సంచిలో కూరలు తప్ప ఇవాళేమీ లేవు. బహుశా ఇవాళ్టికి పని పూర్తిచేసుకుని ఉంటాడు. ఎన్ని సీసాలు ఎక్కడెక్కడ ఇచ్చావురా అంటే తెలియదని ముందు బుకాయించాడు. తర్వాత ఏడుస్తున్నాడు. ఇందాకనే ఓర్పు నశించి కేవలం రెండుమాత్రం తగలనిచ్చాను. అప్పటికీ లాభం లేకపోయింది. అప్పుడు మరొకటి తగిలించబోతుంటే మీ పేరు బయటికి వచ్చింది.

"మాస్టారికి బాటిల్ ఇచ్చావా? అని గద్దించి మరోటి తగలనిచ్చాను. అప్పుడు మీరు వాణ్ణి ఎరుగుదురని చెప్పాడు. ఈ నస కేసు ఎంతసేపని భరించగలను. అందుకే మీకు శ్రమ ఇచ్చాను."

నా మనసంతా వికలమైంది. ముస్తఫా వంక చూశాను. ఇప్పుడు వాడు మళ్లీ ఏడుస్తున్నాడు.

శంకరం వాణ్ణి కసురుకుంటూ, "నోర్మూయ్! బాడ్‌ఖవ్! ఏడిస్తే వీపు చిట్లగొడతాను!" అని అరిచాడు.

బయట పొద్దుగూకుతున్నది. ఆవరణలో నిద్ర గన్నేరు నిద్రపోతున్నది.

నేను నెమ్మదిగా మాట్లాడాను.

"షాపు మూతబడి ఆ వచ్చే కాసిని పైసలూ రాక, తండ్రి కొట్టి వెళ్లగొడితే ఆనా డెప్పుడో

# జీవితం గురించి

ఎడారిని కప్పుకున్నప్పుడు నిద్ర ఊపిరాడక చనిపోయింది
ఒక కంప్యూటర్ని గేదె నములుతూ క్షీరాలకి బదులు
అక్షరాల్ని స్రవిస్తోంది.
ఒకడు గుడి కూలిస్తే ఇంకోడు మసీదు కూలిస్తే
మరోడు గ్యాస్ ధర పెంచాడు
ఇందులో నీతి కిరోసిన్‌తో ఇళ్లు తగలబెట్టకండి.

**** ****

వెన్నెల పూసిన, నక్షత్రాల్ని చల్లిన ఆకాశాన్ని
చపాతీలా మడిచి తిందామంటే కుదర్డంలేదు!
పర్వతాలకు నదుల్ని బిగించి
పాటలు మీటడ మొక్కటే సాధించగలిగాను.

**** ****

అవమానం సులభ వాయిదాల్లో దొరికినా నా కొద్దు
అరణ్యాలు తల దువ్వుకోవు
నగరాలు స్నానం చెయ్యవు
గ్రంథాలయాల్ని తగులబెట్టి చలి కాచుకోలేను
నిలువెత్తు అద్దంలోకి నడుచుకుంటూ వెళ్లిన
'నికనోర్ పర్రా!'
నీ కోసం నిద్రలేకుండా కాచుకున్నా!
'ఆక్టేవియోపాజ్' కోసం
అన్నం తినకుండా ఎదురుచూస్తున్నా!

సౌభాగ్య



వచ్చాడు నా దగ్గరికి. మంచి వెధవే. తన సోదంతా వెళ్లబోసుకున్నాడు. అయితే అప్పుడు నాతో ఉన్న ఒక స్నేహితుడు వీడి కథ విని దయతలచినవాడిలా 'నా కొదిలేయండి, నేను చూసుకుంటాను' అన్నాడు. ఏదో పని ఇప్పించి ఉద్ధరిస్తాడనుకున్నా నంతే! ఇలాటి రొచ్చులోకి దింపుతాడని అనుకోలేదు.

శంకరం చేతి వేళ్లు విరుచుకుంటూ, "సరే" అని ముస్తఫా వైపు తిరిగి, "లే వెధవా! వెళ్లు! వెళ్లిపో! మళ్లీ కనిపించావా నా చేతిలో చచ్చావే!" అని అరిచాడు.

ముస్తఫా గడగడలాడుతూ లేచి నిలబడగానే, మళ్లీ గొంతు తగ్గించి — "వెధవా! మంచిగా బతకరా! ఏదో ఒక కష్టం చేసుకుని బతుకు! కష్టపడి బతకడంలో ఉందిరా ఆనందం, సుఖం! కష్టపడి సంపాదించిన అన్నమే అమృతంరా!" అని ఇంకా ఇలాంటి మాటలు చాలా చెప్పాడు. వాడి డబ్బు వాడికిచ్చాడు.

ముస్తఫా మహాబుద్ధిమంతుడిలా తల వంచుకుని, ఇంకా వెక్కుతూనే అన్నీ విన్నాడు. ఆ తర్వాత అతి వినయంగా అతనికీ, ఆ తర్వాత నాకూ నమస్కరించి మోచేతులతో కళ్లు తుడుచుకుంటూ వెళ్లి తన కూరగాయల సంచి భుజాన తగిలించుకుని బయటకు వెళ్లిపోయాడు.

అంతలో కాఫీ వచ్చింది. "ఈవేళప్పుడు కాఫీ ఎందుకయ్యా?" అంటూనే కప్పు అందుకున్నాను.

మన దేశం తన చిన్నప్పటికీ, ఇప్పటికీ ఎంతగా పాడైపోయిందో చాలా ఆవేదనతో చెప్పుకుపోతున్నాడు శంకరం.

మన దేశం నా చిన్నప్పటికీ, ఇప్పటికీ మరెంతగా పాడైపోయిందో మరింత ఆవేదనతో, ఆవేశంతో నేనూ ఉపన్యసించాను.

తర్వాత లేచి, "వస్తా న్నాయనా!" అని ఇవతలికి వచ్చాను.

"అప్పుడప్పుడూ వస్తూండండి!" అన్నాడు శంకరం.

రోడ్డు చివరివరకూ మందంగా వెలుగు చీకట్లు పరుచుకుని ఉన్నాయి. వీధి దీపాలు కరెంటు కోత వల్ల నిద్రపోతున్నాయి.

నేను నడుస్తున్నాను. వీధి చివర చీకట్లో నుంచి లేచి వచ్చాడు ముస్తఫా. నవ్వుతూనే ఉన్నట్టున్నాడు.

"మజ్జానం నుంచీ కూచోబెట్టారు సార్! తిట్లు తినలేక సచ్చాను. రెండు దెబ్బలూ పడ్డాయనుకోండి. కాని పాపం గట్టిగా కొట్టలేదులెండి" అన్నాడు.

నే నేమీ మాట్లాడలేదు.

వాడు నా వెనకనే వస్తూ, "పోలీసు అయ్యగారు కష్టపడి బతకమని చెప్పారుగా సార్? కష్టపడి బతికేవాడే మడిసి అన్నారు కదా సార్! నే నెంత కష్టపడుతున్నానో చెప్పండి సార్! రోజుకు ఎంత దూరం నడుస్తానో తెలుసా, సార్! ఊరి ఆ కొసన ఒకటి, ఈ కొసన ఒకటి. వన్‌టౌన్లో ఎక్కడో మూల ఇంకోటి. నిన్ననైతే ఒక్క కేసు కోసం ఏకంగా ఆరు మైళ్లు నడిచాను సార్! ఎండగాలిలో ... నాది కష్టం కాదా సార్! మీరే చెప్పండి సార్!" అంటున్నాడు.

నేను నడకలో వేగం హెచ్చించాను.

వాడు ఆగి, వెనక నుంచి, "వస్తాను సార్! దయ ఉంచండి! ఇంటికాడ మా అమ్మ ఎదురు చూస్తా ఉంటది!" అనడం వినిపించింది.

నేను వెలుతురు లేని రోడ్డు మీద నడుస్తున్నాను.

★

# అస్తిత్వం



పేదదాని మెళ్లో
వజ్రాల హారంలా
నీ గుండె కడ్డంగా ఆ
దారప్పోగు నీ అస్తిత్వానికే
ఎసరు తెచ్చేట్టుంది
ఎప్పుడో ఎవడో ఏదో
చేశాడని [?]
నీ న్నివాళ ఉప్పుపాతర
వేస్తామంటున్నారు
నీ కేది దారి?
ఒక్కటే
నీలోకి నీవు కుంచించుకుపోవాలి
లేదా
నిన్ను నీవే దేశ బహిష్కారం చేసుకోవాలి!

కేతవరపు వెంకట రమణమూర్తి

## ఆటంబాంబులు పేలితే... !

ఒక మెగా టన్ను ఆటంబాబు పేలినప్పుడు ఏమి జరుగుతుందోనని ఎప్పుడైనా ఆలోచించారా? నిజంగానే అలా జరిగితే సంభవించే నష్టాలకు లెక్కే లేదు. భవనాలు, వాహనాలు, చెట్టూ చేమ, పశువులు, మానవులు, పంటలు సమస్తం బూడిదగా మారిపోతాయి. హాహాకారాలు చేసేందుకు కూడా ఏ ప్రాణీ మిగలదు.

ఒక బాంబు పేలగానే ఒకటిన్నర కిలోమీటర్ల జ్వాల ఉద్భవిస్తుంది. వెంటనే భూమి ఉష్ణోగ్రత పెరుగుతుంది. విద్యుదయస్కాంత క్షేత్ర ప్రభావం వలన విద్యుత్పరికరాలు, అయస్కాంతపు పనిముట్లు పనిచేయటం ఆగిపోతుంది. బాంబు పేలినచోట ఒక కిలోమీటరు వ్యాస పరిధిలో చుట్టూరా ఉష్ణోగ్రత కోటి డిగ్రీల సెంటీగ్రేడ్‌ను చేరుతుంది. ఇది సమస్త ప్రాణుల్నీ ఆవిరి చేయగల అత్యధికమైన వేడిమి. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇనుము, ఉక్కు అవలీలగా కరిగిపోతాయి. మనుషుల సంగతి చెప్పనక్కర్లేదు. ఉన్న ఫళంగా భస్మమై కుప్పకూలిపోతారు. ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్లాస్టిక్, ప్రత్తి చెట్లు తమంతట తామే జ్వలించటం ప్రారంభిస్తాయి. బాంబు పేలిన స్థలానికి ఎనిమిది కిలోమీటర్ల దూరాన ఉన్న బట్టలు సైతం మండిమసైపోతాయి. బాంబు పేలిన స్థలానికి పదకొండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మనుషులు శరీరాలు కాలి గాయాలవుతాయి. ఆ గాయాలు ఏ మందులకూ లొంగక ప్రాణాలు పోతాయి. బాంబు పేలిన మరుక్షణంలోనే అన్ని గ్యాస్ స్టేషన్లు, పెట్రోలు స్టేషన్లు భగ్గున మండిపోతాయి. బాంబు ప్రభావం వల్ల రెండు మూడు నెలలపాటు మనుషుల మరణాలు సంభవిస్తూనే ఉంటాయి. రేడియేషన్ ప్రభావం వలన జనాభా యావత్తూ నాశనమై ఎటు చూసినా శూన్యమే మిగులుతుంది. కొన్ని సంవత్సరాల వరకు పంటలు పండవు. పైర్లు పెరగవు. ప్రకృతిలోని చెట్టూ, చేమ, పశుపక్ష్యాదులు సమస్తం నశించిపోయి బాంబు పేలిన ప్రాంతం బీడుగా, ఎడారిలా, మరుభూమిలా మారి వెలవెలబోతుంది.

సేకరణ: భూక్యా గోపీనాయక్ (చిలకలూరిపేట)